సర్కారుపై ప్రైవేట్ కాలేజీల జంగ్

నేడు సచివాలయ ముట్టడికి డిగ్రీ కాలేజీల పిలుపు

- ప్రాక్టికల్స్‌ను బహిష్కరించిన జూనియర్ కాలేజీలు
- రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఇంజినీరింగ్ కాలేజీల గుర్రు
- ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం
- అధికార కాంగ్రెస్ పార్టీలో కలవరం

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు ప్రభుత్వ తీరును వ్యతిరేకించడం, ఆందోళనబాట పట్టడం చూస్తుంటాం. విద్యార్థి సంఘాలు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని, మెస్ చార్జీలు పెంచాలని ధర్నాలు, ముట్టడిలు చేపట్టడం గమనిస్తుంటాం. కానీ, ప్రైవేట్ కాలేజీలు ప్రభుత్వతీరును వ్యతిరేకించడం కాంగ్రెస్ పాలనలోనే కనిపిస్తున్నది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్న డిమాండ్‌తో ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యాలు శనివారం సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చాయి. తొలుత ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టి, ఆ తర్వాత ర్యాలీగా వెళ్లి సచివాలయాన్ని ముట్టడించాలని నిర్ణయించాయి.

రూ.4 వేల కోట్ల బకాయిలు..

ప్రభుత్వం నుంచి దాదాపు రూ.4 వేల కోట్ల బకాయిలు విడుదల కావాల్సి ఉన్నది. టోకెన్లు జారీ అయినా విడుదలకానివి రూ.850 కోట్ల వరకు ఉన్నాయి. వీటి కోసం ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు రోడ్డెక్కడం ఇదే మొదటిసారి కాదు. గతంలో రెండుసార్లు స్వచ్ఛందంగా కాలేజీల బంద్ పాటించాయి. ఓసారి ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేశాయి. అప్పట్లో ప్రభుత్వహామీతో యాజమాన్యాలు శాంతించాయి. మొత్తం బకాయిలు విడుదల చేయకపోవడంతో మళ్లీ ఆందోళనకు పిలుపునిచ్చాయి. తాజాగా ప్రైవేట్ జూనియర్ కాలేజీల యాజమాన్యాలు ప్రాక్టికల్స్‌ను బహిష్కరించాయి. మార్చి 5 నుంచి జరిగే థియరీ పరీక్షలను సైతం బహిష్కరిస్తామని హెచ్చరించాయి. ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, నర్సింగ్, ఒకేషనల్ కాలేజీల యాజమాన్యాలు సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై గుర్రుగా ఉన్నాయి.

ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రభావం..

ఓవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు పేరుకుపోవడం, మరోవైపు పైసా విడుదలకాకపోవడంతో కాలేజీల యాజమాన్యాల్లో ఆగ్రహం పెల్లుబుకుతున్నది. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులకు సహకరించమని తెగేసి చెబుతుండడంతో ఆ పార్టీ వర్గాలు కలవరపడుతున్నాయి.

ఏ గేట్ దాటితే ఎంటర్ అయినట్టు?

- ప్రవేశ పరీక్షల నిబంధనల్లో కొరవడిన స్పష్టత
- లేట్ ఎంట్రీపై ఒక్కో సెంటర్‌లో ఒక్కో విధానం
- త్వరలో పరీక్షలు-స్పష్టతకు విద్యార్థుల డిమాండ్

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వివిధ ప్రవేశ పరీక్షలకు అభ్యర్థుల ఆలస్యం ప్రామాణికతపై స్పష్టత కొరవడింది. రాష్ట్రంలో ఎప్‌సెట్, ఎడ్‌సెట్, ఐసెట్ సహా మొత్తం 7 ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షలకు నిమిషం ఆలస్యం నిబంధనను తప్పనిసరిగా అమలు చేస్తున్నారు. ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించడంలేదు. కానీ కొన్ని పరీక్షాకేంద్రాల్లో ప్రాంగణంలోని వివిధ విభాగాల్లో ఏర్పాటు చేసిన హాల్ గేట్ వద్ద నిమిషం నిబంధన అమలు చేస్తుండగా, మరికొన్ని సెంటర్లలో మెయిన్ గేట్ వద్ద ఎంట్రీని పరిగణలోకి తీసుకుంటున్నారు. గతంలో పలు సెంటర్లలో ఈ సమస్య ఏర్పడింది. మే, జూన్‌లో ఎప్‌సెట్, ఐసెట్, ఎడ్‌సెట్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నెల 3 నుంచి జరగనున్న సెట్ కమిటీ సమావేశాల్లో నిమిషం నిబంధన ఏ గేట్ వద్ద పరిగణలోకి తీసుకుంటారో స్పష్టతనివ్వాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

14 ఏండ్ల తర్వాత ‘అగ్రి’వర్సిటీలో నియామకాలు

- వ్యవసాయ వర్సిటీ రిజిస్ట్రార్‌గా విద్యాసాగర్, పరిశోధనా సంచాలకులుగా బలరాం
- 18 మందిని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసిన వీసీ డాక్టర్ అల్దాస్ జానయ్య

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 14 ఏండ్ల తర్వా త రిజిస్ట్రార్, సంచాలకులు, డీన్‌తోపాటు పలు కీలక పదవులకు పూర్తి స్థాయి నియామకాలు జరిగాయి. రిజిస్ట్రార్‌గా డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్, పరిశోధనా సంచాలకులుగా డాక్టర్ ఎం బలరాం, పీజీస్టడీస్ డీన్‌గా కేబీ ఈశ్వరి, విస్తరణ సంచాలకులుగా డాక్టర్ ఎం యాకాద్రి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్‌గా డాక్టర్ చల్లా వేణుగోపాల్‌రెడ్డి, డీన్ ఆఫ్ అగ్రికల్చర్‌గా డాక్టర్ కే ఝాన్సీరాణి, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్‌గా డాక్టర్ కేవీ రమణరావు, లైబ్రేరియన్‌గా డాక్టర్ జే వివేక్‌వర్ధన్ నియమితులయ్యారు. ఈ పోస్టులతోపాటు మరో 10మందిని కీలక పరిశోధన సంస్థలు, కేంద్రాలకు సంచాలకులుగా నియమించారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జానయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరు మూడేండ్లపాటు పదవీలో కొనసాగనున్నారు. నియమితులైన 18మందిలో ఐదుగురు మహిళ ప్రొఫెసర్లు ఉన్నారని జానయ్య వివరించారు. జనరల్ క్యాటగిరీ వర్గానికి చెందిన ఆరుగురిని, వెనుకబడిన వర్గాలకు చెందిన ఎనిమిది మందిని, ఎస్సీ వర్గాలకు చెందిన ముగ్గురిని, ఎస్టీ వర్గానికి చెందిన ఒకరిని నియమించినట్టు వెల్లడించారు.

జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి

ఓయూలో విద్యార్థుల నిరసన

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నిరుదోగ్యులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 31: రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఓయూ జేఏసీ చైర్మన్ మోతీలాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలో భాగంగా జాబ్ క్యాలెండర్‌ను వి డుదల చేయాలని కోరారు. నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని డి మాండ్ చేస్తూ విద్యార్థులు ఉస్మానియా యూనివర్సిటీ మెయిన్ లైబ్రరీ ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోతీలాల్‌నాయక్ మాట్లాడుతూ.. జాబ్ నోటిఫికేషన్లు ఇచ్చే వరకు ఉద్యమాన్ని ఆపబోమని తెగేసి చెప్పారు. ఎమ్మెల్సీ ఎ న్నికల్లో ‘కాంగ్రెస్ పార్టీకో హఠావో- జాబ్ క్యాలెండర్‌కో బచావో’ నినాదంతో ప్రచారం చేసి, కాంగ్రెస్ అభ్యర్థి ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని తేల్చిచెప్పారు. పదవీ విరమణ వయస్సు ను పెంచుతూ వెళ్తుంటే నిరుద్యోగులు ఏం కావాలని ప్రశ్నించారు.

ధర్మపురి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఐదుగురు విద్యార్థినులకు ఫుడ్‌పాయిజన్!

ధర్మపురి మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో ఘటన

ధర్మపురి, జనవరి 31 : జగిత్యాల జిల్లా ధర్మపురి మైనారిటీ బాలికల వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో ఐదుగురు విద్యార్థినులు ఫుడ్‌పాయిజన్‌కు గురయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం భోజనం అనంతరం ఇంటర్ మొదటి సంవత్సరం (సీఈసీ)చదువుతున్న గొల్లపెల్లి మండలం చిల్వకోడూర్‌కు చెందిన కీర్తిమణి కడుపు నొప్పి అంటూ కళాశాల నర్స్ సహోజకు చెప్పుకుంది. నెలసరి సమస్యగా చెప్పి మెడిసిన్ ఇవ్వకుండా విశ్రాంతి తీసుకోవాలని ఆమె సూచించింది. కొద్దిసేపటికే ధర్మపురి మండలం బుద్దేశ్‌పల్లికి చెందిన అల్లకొండ నందిని (ఫస్టియర్, సీఈసీ) కడుపు నొప్పి, వాంతులు అంటూ రాగా స్టాఫ్ నర్స్ ప్రిన్సిపాల్ కాళ్ల లక్ష్మికి తెలిపారు. మంచిర్యాల జిల్లా తాళ్లపేటకు చెందిన హుమేరియా(ఫస్టియర్ సీఈసీ), సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన శ్రావ్య(సెకండ్ ఇయర్ సీఈసీ), కోరుట్ల మండలం నాగులపేటకు చెందిన జుహా (ఫస్టియర్) కూడా కడుపునొప్పి, వాంతులు అంటూ ప్రిన్సిపాల్‌కు మధ్యాహ్నం 3 గంటలకే వచ్చి చెప్పారు. కడుపు నొప్పి తీవ్రం కావడంతో రాత్రి 8గంటలకు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆహారం సరిగా ఉడకక జరిగి ఉంటుదని వైద్యుడు రాము తెలిపారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విద్యార్థులను పరామర్శించి, ప్రైవేటు దవాఖానకు తరలించారు.

చివరి నిమిషంలో ‘రిటైర్మెంట్’ పెంపు

- ఈ నెలలోనూ కొందరి ప్రొఫెసర్ల రిటైర్మెంట్
- స్పష్టతలేక జేఎన్టీయూలో ఆగిన రిటైర్మెంట్ ఫంక్షన్

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయో పరిమితిని పెంచుతూ ప్రభుత్వమిచ్చిన ఉత్తర్వులు గందరగోళానికి దారితీశాయి. నెలాఖరులో ఒక రోజు ముందుగా ఇచ్చిన ఉత్తర్వులతో గందరగోళం నెలకొన్నది. రాష్ట్రంలోని ప్రొఫెసర్ల వయోపరిమితిని 60 నుంచి 65 ఏండ్లకు పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అయితే జీవోపై 28వ తేదీన ఇచ్చినట్టు ప్రచురించారు. అయితే ఈ ఉత్తర్వులు గురువారం విడుదలయ్యాయి. జేఎన్టీయూ, మహాత్మాగాంధీ వర్సిటీల్లో పలువురు శుక్రవారమే పదవీ విరమణ పొందాల్సి ఉంది. గురువారం రాత్రి 9గంటలకు ఈ ఉత్తర్వులు బయటికొచ్చాయి. అప్పటికే పలువురు ప్రొఫెసర్లు పదవీ విరమణ సభలను ఏర్పాటు చేసుకున్నారు. జేఎన్టీయూలో సివిల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఓ ప్రొఫెసర్ పదవీ విరమణ సభకు ఆయన సన్నిహితులు అన్ని ఏర్పాట్లు చేశారు. రాత్రి జీవో బయటికిరావడంతో రిటైర్మెంట్ సభను నిలిపివేసుకున్నారు. ఓయూలో ముగ్గురు పదవీ విరమణ పొందాల్సి ఉండగా, వయోపరిమితి పెంపుతో సన్మాన సభలను రద్దుచేసుకోవాల్సి వచ్చింది. మరికొందరు సన్మానాలకు బదులు అభినందనలు చెప్పాల్సి వచ్చింది. అయితే జనవరి 29న ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడింది. ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో కోడ్ ఉల్లంఘన కిందికి రాకుండా జనవరి 30నే జీవో జారీచేసిన జీవోపై 28వ తేదీని ప్రచురించారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

రిటైర్మెంట్ పెంపు నిరుద్యోగులకు శాపం: బీఆర్ఎస్వీ

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లోని ప్రొఫెసర్ల వయస్సును 60 నుంచి 65 ఏండ్లకు పెంచడం భావితరాలకు గొడ్డలిపెట్టని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ విమర్శించారు. 420 రేవంత్ ప్రభుత్వం ఇప్పటికే నిరుద్యోగుల పాలిట యమపాశంగా మారిందని మండిపడ్డారు. క్యాలెండర్ ఇయర్‌ను అటకెక్కించారని ఆరోపించారు. ప్రొఫెసర్లకు పెంచిన రిటైర్మెంట్ వయస్సును వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో తెలంగాణ అగ్నిగుండంగా మారుతుందని శుక్రవారం ప్రకటనలో హెచ్చరించారు.

గ్రూప్-1పై మళ్లీ సుప్రీంకు

- ఎస్ఎల్‌పీ దాఖలు చేసిన అభ్యర్థులు
- టీజీపీఎస్సీ కేవియట్ పిటిషన్

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గ్రూప్-1 ఫలితాల విడుదలకు మరోసారి బ్రేకులు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే సుదీర్ఘ న్యాయపోరాటం చేస్తున్న అభ్యర్థులు.. తాజాగా మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జీవో-29ని సవాల్ చేస్తూ వికలాంగుల కోటా రోస్టర్‌ను మార్చాలన్న డిమాండ్‌తో ఇటీవల సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. ఒక ట్రెండు రోజుల్లో ఈ పిటిషన్ విచారణకు వచ్చే అవకాశమున్నది. గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించడం ఇది నాలుగోసారి. దీంతో అప్రమత్తమైన టీజీపీఎస్సీ.. తమ వాదన వినకుండా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయరాదని కోరుతూ సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనం ఇప్పటికే పూర్తవడంతో ఈ నెలలోనే జనరల్ ర్యాంకింగ్ లిస్టు (జీఆర్ఎల్) విడుదల చేయాలని టీజీపీఎస్సీ భావిస్తున్నది. ఈ తరుణంలో అభ్యర్థులు సుప్రీంకోర్టుకు వెళ్లడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది.

4,357 మంది పిల్లలకు విముక్తి

- ఆపరేషన్ స్మైల్ వివరాలు వెల్లడించిన శిఖాగోయెల్

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జనవరి 1 నుంచి 31 వరకు చేపట్టిన ‘ఆపరేషన్ స్మైల్-XI’ ద్వారా 4,357 మంది పిల్లలను వెట్టిచాకిరి నుంచి విముక్తుల్ని చేసినట్టు ఉమెన్‌సేఫ్టీ వింగ్ డీజీ శిఖాగోయెల్ వెల్లడించారు. ఆపరేషన్ స్మైల్ వివరాలను శుక్రవారం ఆమె మీడియాకు వివరించారు. ఈ నెలలో రెస్క్యూ చేసిన వారిలో బాలకార్మికులు 3,940 మంది ఉన్నారని తెలిపారు. మొత్తం 4,357 మంది చిన్నారుల్లో బాలురు 3,897 మంది, బాలికలు 460 మంది ఉన్నారని, వారిలో 3,905 మందిని తల్లిదండ్రుల చెంతకు చేర్చినట్టు శిఖాగోయెల్ వెల్లడించారు. పిల్లల అక్రమ రవాణాకు పాల్పడిన 1,040 మందిపై 1,038 కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్టు తెలిపారు.

రాధాకిషన్‌రావుకు విముక్తి

బెయిల్‌పై జైలు నుంచి విడుదల

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 31 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ అధికారి రాధాకిషన్‌రావుకు జైలు నుంచి విముక్తి లభించింది. ఆయనకు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడంతో శుక్రవారం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. ప్రస్తుతం ఈ కేసులో మధ్యంతర బెయిల్‌పై కొనసాగుతున్న అదనపు ఎస్పీ భుజంగరావుకు కూడా హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం వారు రూ.లక్ష చొప్పున ఇద్దరి పూచీకత్తులను 14వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ కోర్టుకు సమర్పించారు. రాధాకిషన్‌రావు తన పాస్‌పోర్టును కోర్టుకు జమ చేశారు. హైకోర్టు షరతుల ప్రకారం వారిద్దరూ ప్రతి సోమవారం ఉదయం 11 గంటలకు పంజాగుట్ట పోలీసుల ఎదుట హాజరుకావాల్సి ఉంటుంది. దర్యాప్తు అధికారికి సహకరించాలని, సాక్షులతోపాటు వారి కుటుంబీకులను ప్రభావితం చేయరాదని, మీడియా సమావేశాల్లో పాల్గొనరాదని నిందితులకు కోర్టు స్పష్టం చేసింది.

సీటెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : సెంట్రల్ ఎలిజిబిలిటి టెస్ట్ డిసెంబర్ 2024 ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. డిసెంబర్‌లో నిర్వహించిన పరీక్షల ఫలితాలను సీబీఎస్ఈ శుక్రవారం విడుదల చేసింది. పేపర్-1లో 24.17 శాతం, పేపర్-2లో 12.31శాతం అభ్యర్థులు మాత్రమే క్వాలిఫై అయ్యారు.

ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డి

- అధికారిక ప్రకటన విడుదల చేసిన ఏఐసీసీ
- సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి చెక్ పెట్టిన కాంగ్రెస్

హైదరాబాద్,జనవరి31(నమస్తే తెలంగాణ): మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని పక్కనపెట్టి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వీ నరేందర్‌రెడ్డి పేరును కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. శుక్రవారం ఏఐసీసీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ స్థానంలో సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డిని కాదని నరేందర్‌రెడ్డికి టికెట్ ఇవ్వడంపై సీనియర్ కాంగ్రెస్ నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జీవన్‌రెడ్డిని ప్రత్యక్ష రాజకీయాల నుంచి పంపించే ప్రయత్నమే ఇది అని మండిపడుతున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో 42 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. దాంతోపాటు ఆరు పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 3.41 లక్షల గ్రాడ్యుయేట్ ఓట్లున్నాయి.

సచివాలయంలో రికార్డుస్థాయి బదిలీలు

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సచివాలయంలో రికార్డుస్థాయి బదిలీలు జరిగాయి. శుక్రవారం ఒకేసారి 177 మంది సెక్షన్ ఆఫీసర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. 160 మందిని వివిధ శాఖలకు అదే హోదాలో బదిలీచేయగా, 17 మందికి పదోన్నతి కల్పిస్తూ పోస్టింగ్స్ ఇచ్చారు. ప్రభుత్వం తమకు అనుకూలంగా సచివాలయంలో మార్పులు చేసే క్రమంలోనే ఈ బదిలీలు జరిగినట్టు చెప్తున్నారు. గతేడాది ఆయా శాఖల కార్యదర్శులు, అడిషనల్, అసిస్టెంట్ కార్యదర్శులను బదిలీ చేసింది. ఇప్పుడు ఎస్‌వోలను బదిలీ చేసినట్టు చెప్తున్నారు.

భువనగిరిలో నిర్వహించిన సన్నాహక డప్పు ప్రదర్శనలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందే

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

సూర్యాపేట టౌన్/భువనగిరి అర్బన్, జనవరి 31 : ఈ నెల ఏడు వరకు ఎస్సీ వర్గీకరణ చేయకుంటే లక్ష డప్పులు, వేల గొంతులతో సునామీ సృష్టిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణను దేశంలోనే ముందుగా అమలు చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ఎవరి మాటలకు తలొగ్గి అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రపంచంలో ఎక్కడా జరుగని సాంస్కృతిక ప్రదర్శన 7న హైదరాబాద్‌లో జరుగనుందని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి, సూర్యాపేట జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వర్గీకరణకు అనుకూలంగా మూడు కమిషన్లు తీర్పు ఇచ్చాయని, మూడుసార్లు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారని తెలిపారు. వర్గీకరణకు అడ్డుతగులుతున్నది కాంగ్రెస్‌లోని మాలలేనని ఆరోపించారు.

కాలుష్యకారక పరిశ్రమలను మూసివేయాల్సిందే

పీసీబీ సభ్యుడికి చౌటుప్పల్ మండలవాసుల ఫిర్యాదు

హైదరాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ) : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంతమ్మగూడెం, పరిసర ప్రాంతాల్లో కాలుష్యాన్ని వెదజల్లుతున్న రసాయనిక పరిశ్రమలను మూసివేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. జయ, వినీత్, హజెలో, బృందావన్, రావుస్, కెమిక్ లైఫ్ సైన్స్ తదితర ల్యాబోరేటరీలు విపరీతమైన వాయు, జల, భూ కాలుష్యానికి పాల్పడుతున్నాయని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)కి ఫిర్యాదు చేశారు. కెమిక్ పరిశ్రమకు జనవరి 27న పీసీబీ ఇచ్చిన క్లోజర్ ఆర్డర్‌లో స్పష్టత లేదనే కారణంతో.. శుక్రవారం చౌటుప్పల్ మండలానికి చెందిన గుమ్మి దామోదర్‌రెడ్డి నేతృత్వంలో రైతులు హైదరాబాద్‌లోని పీసీబీ కార్యాలయంలో బోర్డు సభ్యుడు శరత్‌చంద్రారెడ్డిని కలిసి ఈ మేరకు రసాయన పరిశ్రమలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమకు పరిశ్రమలు ఇచ్చే పరిహారం ముఖ్యం కాదని, స్థానికుల ఆరోగ్య రీత్యా ఆ పరిశ్రమలను శాశ్వతంగా మూసివేయాలని డిమాండ్ చేశారు.

సీఈఈకి ఫిర్యాదు చేస్తున్న దామోదర్‌రెడ్డి

6 నెలల్లోనే 38 ట్యాంకర్లు..

ఆయా కంపెనీలు వ్యర్థ వాయువులను గాలిలోకి, రసాయన జలాలను ఖాళీ స్థలాలు, మూసీ పరీవాహక ప్రాంతంలో వదిలేస్తున్నాయని శరత్‌చంద్రారెడ్డికి వివరించారు. కెమిక్ లైఫ్‌సైన్స్ పరిశ్రమ కేవలం ఆరు నెలల్లోనే 38 ట్యాంకర్ల వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వదిలినట్టు తెలిపారు. 2024 డిసెంబర్‌లో టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం తనిఖీకి వస్తున్నదని తెలిసి శ్రీజయ ల్యాబోరేటరీస్ వ్యర్థ రసాయనాలను వాహనాల ద్వారా తరలించినట్టు ఫిర్యాదుచేశారు. కాలుష్యకారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని అనేక సార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

పార్టీ మారితే.. రాజీనామా చేయాల్సిందే

- మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలి
- అప్పుడే ప్రజాస్వామ్య నైతికతకు అర్థం
- పార్టీ మారినప్పటికీ పదవికి రాజీనామా చేయకపోవడమంటే ప్రజాతీర్పును అవమానించడమే
- అలాంటి వారిని ఓడించాలో, గెలిపించాలో ప్రజలకు బాగా తెలుసు
- ఓ కేసులో కేరళ హైకోర్టు వ్యాఖ్యలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో):

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): పార్టీ మారాలనుకొనే ప్రజాప్రతినిధులు ముందుగా తమ పదవికి రాజీనామా చేయాలని కేరళ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రాజీనామా అనంతరం తిరిగి నిర్వహించే ఎన్నికల్లో గెలిచి చూపించాలని సూచించింది. అప్పుడే ప్రజాస్వామ్య నైతికతకు సరైన అర్థమని వ్యాఖ్యానించింది. ఓ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ పీవీ కున్హికృష్ణన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

ఏమిటీ కేసు?

కేరళలోని కూతట్టుకులం నగర మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపక్ష యూడీఎఫ్ కూటమి ప్రవేశపెట్టింది. అయితే అధికార ఎల్డీఎఫ్ కూటమికి చెందిన కాలా రాజు అనే మహిళా కౌన్సిలర్ చైర్మన్‌కు వ్యతిరేకంగా ఓటేస్తుందన్న అనుమానంతో సొంతపార్టీకి చెందిన నేతలే ఆమెను కిడ్నాప్ చేశారు. ఇదే సమయంలో తమ పార్టీకి చెందిన మహిళా కౌన్సిలర్ కూడా చైర్మన్‌కు అనుకూలంగా ఓటేయవచ్చన్న అనుమానంతో విపక్ష పార్టీ యూడీఎఫ్ కార్యకర్తలు కూడా ఆమెను అపహరించారు. ఈ క్రమంలో వాళ్లు అరెస్టయ్యారు. దీనిపై విచారించిన కోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేస్తూ నిందితులకు బెయిల్‌ను మంజూరు చేసింది.

కోర్టు కీలక వ్యాఖ్యలు ఇవి

- ఒక పార్టీకి చెందిన ఎమ్మెల్యే లేదా ఎంపీ మరో పార్టీలోకి వెళ్లాలనుకొంటే ముందు తన పదవికి రాజీనామా చెయ్యాలి.
- ఆ తర్వాత జరిగే ఎన్నికల్లో పోటీ చేసి ప్రజామద్దతును మళ్లీ కూడగట్టుకోవాలి. అప్పుడే ప్రజాస్వామ్య నైతికతకు సరైన అర్థంగా భావించవచ్చు.
- ప్రజల మద్దతుతో ఓ పార్టీలో గెలిచి, మరో పార్టీలోకి మారినప్పటికీ పదవికి రాజీనామా చేయకపోవడమంటే ప్రజాభీష్టాన్ని అవమానించడమే అవుతుంది.
- అలాంటి పనులు చేసిన వారిని ఎన్నికల్లో ఓడించాలో? గెలిపించాలో? ప్రజలకు బాగా తెలుసు. ప్రజాస్వామ్యానికి ఉన్న గొప్పదనం అదే.
- ఈ కేసు విషయంలో ఎల్డీఎఫ్, యూడీఎఫ్ నేతలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని ప్రయత్నించారు. ప్రజాస్వామ్య బద్ధంగా వెళ్లాలన్న ఆలోచనను ఎంత మాత్రం చేయలేదు.
- ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు అనే ఆయుధంతోనే ఓడించాలి. ఆయుధాలు, హింసతో కాదు.

అసెంబ్లీ ఆఖరుదాకా.. అంతే సంగతా!

మొదటిపేజీ తరువాయి...

ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడంపై న్యాయస్థానం తీవ్రస్థాయిలో స్పందించింది. ఈ కేసులో శుక్రవారం జరిగిన విచారణ సందర్భంగా అసెంబ్లీ కార్యదర్శి తరపున హాజరైన న్యాయవాదిని ధర్మాసనం నిలదీసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై ఫిర్యాదు అంది పది నెలలు గడుస్తున్నా వారికి నోటీసులు జారీచేసేందుకు ఇంకా తీరిక దొరకలేదా అని ప్రశ్నించింది. సముచిత సమయం కావాలని న్యాయవాది కోరడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ‘సముచిత సమయం అంటే శాసన సభా సమయం ముగియాలా? అసెంబ్లీ గడువు పూర్తయ్యే వరకు చర్యలు తీసుకోరా?’ అని నిప్పులు చెరిగింది. మహారాష్ట్ర అసెంబ్లీలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేల కేసు మాదిరిగా చేస్తారా?.. అని నిలదీసింది. దీనిపై న్యాయవాది స్పందిస్తూ, తాను స్పీకర్ తరపున వాదించడం లేదని, అసెంబ్లీ కార్యదర్శి తరపున వాదిస్తున్నానని వివరించడంపై అసహనం వ్యక్తం చేసింది. అసెంబ్లీ కార్యదర్శి, శాసనసభ స్పీకర్‌తో మాట్లాడతారు కదా.. తెలుసుకుని చెప్పండని మండిపడింది. తమకు రెండు వారాల గడువు ఇస్తే తెలుసుకొని చెప్తానని న్యాయవాదం చెప్పడంపై ధర్మాసనం స్పందిస్తూ.. ‘తెలుసుకొని చెప్పడానికి హైదరాబాద్ వెళ్లక్కర్లేదు, ఫోన్లలో మాట్లాడి కూడా తెలుసుకోవచ్చు’ అని వ్యాఖ్యానించింది. వారం రోజులు మాత్రమే గడువు ఇస్తున్నట్టు తేల్చిచెప్పింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 10వ తేదీకి వాయిదా వేసింది.

ఎప్పటిలోగా చర్యలు తీసుకుంటారు?

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిర్యాదుల మీద మూడు నెలల్లోగా విచారణ చేపట్టాలని, అందుకు షెడ్యూల్‌ను ఖరారు చేయాలని గతంలో తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు చెప్పారు. దీనిని సవాల్ చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్‌ను విచారించిన హైకోర్టు డివిజన్ బెంచ్.. ‘స్పీకర్ తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలి..’ అని గత నవంబర్ 22న తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కే వివేకానంద్ జనవరి 16న సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలుచేశారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తొలుత రెండు వేర్వేరు స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు. మిగిలిన ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం సంజయ్ కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్‌రెడ్డి, అరెకపూడి గాంధీపై వేరుగా వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. వీటిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది.

హైకోర్టు ఆదేశించినా స్పీకర్ చర్యలు శూన్యం

పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు, మోహిత్‌రావు వాదనలు వినిపిస్తూ, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్‌కు పిటిషనర్లు ఫిర్యాదు చేసి పది నెలలైందని, ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని చెప్పారు. హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసి సుమారు ఏడు నెలలు గడుస్తున్నప్పటికీ స్పీకర్ కార్యాలయం ఏవిధమైన నిర్ణయాలూ వెల్లడించలేదని తెలిపారు. కనీసం పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు కూడా ఇవ్వలేదని చెప్పారు. దీనిపై అసెంబ్లీ కార్యదర్శి తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి స్పందిస్తూ, పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న అభియోగాలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అయ్యాయని చెప్పారు. దీనిపై ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. స్పీకర్‌కు ఫిర్యాదు ఎప్పుడు అందింది, ఎప్పుడు నోటీసులు జారీ అయ్యాయి అని ప్రశ్నించింది. దీనిపై రోహత్గీ జవాబు చెప్తూ.. గత ఏడాది మార్చి 18న ఫిర్యాదు అందగా, ఈ ఏడాది జనవరి 15న స్పీకర్ కార్యాలయం ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిందని చెప్పారు. ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్‌కు అవగాహన ఉందని, నిర్ణయం తీసుకోవడానికి సముచిత సమయం అవసరమని చెప్పారు. స్పీకర్ నిర్ణయాలు వెలువరించే విషయంలో సుప్రీంకోర్టు ఇంతకుముందు సుభాష్‌రాయ్ కేసులో ‘సహేతుక సమయం (రీజనబుల్ టైం)లోగా నిర్ణయం తీసుకోవాలి’ అని చెప్పిందని గుర్తుచేశారు. ఈ కేసులో స్పీకర్ ముందున్న ఫిర్యాదుల పరిష్కారానికి కోర్టులు షెడ్యూల్‌ను నిర్దేశించడానికి వీలు లేదని అన్నారు.

రీజనబుల్ టైం అంటే.. పుణ్యకాలం పూర్తి కావాలా?

‘రిజనబుల్ టైం..’ అంటే ఎంతనో చెప్పాలని ధర్మాసనం నిలదీసింది. స్పీకర్ నిర్ణయానికి సంబంధించి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గతంలో వెలువరించిన తీర్పులను రోహత్గీ మరోసారి గుర్తుచేయగా.. జస్టిస్ బీఆర్ గవాయి జోక్యం చేసుకుంటూ.. ‘శాసనసభ గడువు ముగిసే వరకు నిర్ణయం తీసుకోకుండా ఉండటమే సముచిత సమయమా?’ అని నిలదీశారు. ఎమ్మెల్యేల పదవీకాలం ముగిసేవరకూ నిర్ణయం తీసుకోరా?, మహారాష్ట్ర స్పీకర్ మాదిరిగా వ్యవహరిస్తారా.. అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై గత ఏడాది మార్చిలో ఫిర్యాదులు అందితే పది నెలలకు నోటీసులు ఇచ్చారంటే ఏమనుకోవాలని ప్రశ్నించారు. దీనిపై రోహత్గీ బదులిస్తూ.. స్పీకర్‌కు ఫిర్యాదు అందాక పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించడం వల్లనే జాప్యం జరిగిందని చెప్పారు.